క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మంగళగౌరి వ్రతం

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల దుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మంగళగౌరి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే తొలి మంగళవారంలో మంగళగౌరి వ్రతం ఆచరించడం సంప్రదాయమని వేదపండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి కలశపూజ నిర్వహించిన అనంతరం మంగళగౌరి వ్రతాన్ని ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే ఆలయంలోని అమ్మవారిని కలువ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



వైఎంఆర్ కాలనీలో ఆక్రమణలు జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలో మంగళవారం నుంచి ఆక్రమణల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీ సహాయంతో ర్యాంప్‌లను తొలగించారు. పార్కు వద్ద ఉన్న రాయుడు స్టాల్ వద్ద నుంచి పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు.

సీఐకి సన్మానం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల సీఐ చిరంజీవి బదిలీపై కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు వెళుతున్న సందర్భంగా సోమవారం రాత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతలను అరికట్టడంలో ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకుండా చిరంజీవి విధులు నిర్వహించారని పోలీసు సిబ్బంది కొనియాడారు.

హిరోషిమ ఘటన బాధాకరం

ప్రొద్దుటూరు కల్చరల్ : హిరోషిమపై జరిగిన అణుబాంబు ఘటన బాధాకరమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు తెలిపారు. స్థానిక మోడంపల్లెలోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం హిరోషిమ ఘటనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 ఆగస్టు 6న హిరోషిమపై ప్లుటోనియం 239 అణుబాంబ్ పేలడంతో లక్షన్నరమందికిపైగా చనిపోయారని, 3 లక్షల మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో అక్కడి ప్రజలు ఇప్పటికీ బాధపడుతూనే ఉన్నారని చెప్పారు. సైన్స్‌ను మానవ హితం కోసమే వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మునెమ్మ, అమరావతి, ప్రశాంత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలి

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. మంగళవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల భూమి యాజమాన్య హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాజేయాడానికి ఏకంగా 40 సవరణల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించేందుకు కుట్రపన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి మహ్మద్‌రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం పాల్గొన్నారు.

అర్హులందరికి పక్కా ఇళ్లు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బి.కోడూరు : మండలంలోని అర్హులైన ప్రతిఒక్కరికి పక్కా ఇళ్లు అందేలా చూడాలని ఎంపీడీఓ భాస్కరరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన బి.కోడూరు ఎంపీడీఓ సభా భవనంలో పీఎంజీవై హౌసింగ్ ప్రోగ్రామ్‌పై ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుంచి 2023 వరకు మంజూరైన ఇళ్లను డిసెంబర్ లోపు పూర్తి చేసుకోవాలని, ఆ తర్వాత మొదలు పెట్టిన పూర్తి చేసిన ఇళ్లకు డబ్బులు రావు అని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. మండలంలోని అర్హులందరికి పీఎంజీవో పథకం అందేలా చూడాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రమేష్‌బాబు, ఉపాధి ఈసీ ఖాజా, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుక్కల రాజ్యం..

పిక్కలు భద్రం

- హడలెత్తిస్తున్న గ్రామసంహాలు
- చిన్నారులు, వృద్ధులపై పెరుగుతున్న దాడులు
- నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలం
- బెంబేలెత్తుతున్న ప్రజలు



పట్టణంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తూ చిన్నారులు, వృద్ధులపై విచ్చలవిడిగా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతుండడంతో కుక్కల బారినపడి గాయాలపాలవుతున్న ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

మున్సిపాలిటీలోని 26 వార్డులలో దాదాపు లక్ష మంది జనాభా నివసిస్తుండగా సుమారు 3 వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అంచనా. ముఖ్యంగా పట్టణంలోని అంజనేయనగర్, రాధాకృష్ణనగర్, దూదేకులవీధి, దర్గావీధి, జాంబవంతనగర్, అబ్బురాతివీధి, రాజుగారివీధి, సుందరయ్య కాలనీ, మడకలవారిపల్లె, శివానగర్, సిద్దవటంరోడ్డు, శ్రీకృష్ణ దేవరాయనగర్‌తో పాటు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో, పట్టణంలోని మరికొన్ని వీధులలో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. పట్టణంలో నిత్యం ఎక్కడో ఓచోట కుక్కలు ప్రజలపై దాడి చేస్తూనే



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

ఉన్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రితో పాటు తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతిరోజూ నలుగురైదుగురు కుక్కకాటుకు గురై చికిత్సకు వస్తున్నారంటే పట్టణంలో కుక్కల బెడద ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. గతేడాది ప్రభుత్వాసుపత్రిలో 2,170 కుక్కకాటు కేసులు నమోదయ్యాయంటే కుక్కల బెడద ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి జూలై చివరి వరకు 1,074 మంది కుక్కకాటుకు గురై చికిత్స చేయించుకున్నారు.

నామమాత్రపు చర్యలు

కుక్కల నియంత్రణలో మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రజలతో పాటు, ఆయా వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో చర్చించినా ఫలితం ఉండటం లేదు. రెండేళ్ల క్రితం ప్రత్యేక సిబ్బందిని నియమించి కొన్ని కుక్కలను పట్టి ఊరి చివర వదిలేయగా అవి తిరిగి పట్టణంలోకే చేరుకున్నాయి. అలాగే కుక్కల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమం ద్వారా కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్‌లు చేయించి సంతతి పెరగకుండా నియంత్రించవచ్చు. అయితే ఇప్పటివరకు మున్సిపల్ రికార్డుల ప్రకారం కేవలం 239 కుక్కలకు మాత్రమే ఆపరేషన్‌లు చేయించారు. ఈ విధానంలో ఒక్కో కుక్కకు రూ.800 మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా నిధులు రాకపోవడం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో లక్ష్యం నీరుగారుతోంది.

భయాందోళనలో ప్రజలు

పట్టణంలోని పలు వీధులలో కుక్కలు రోడ్లపై వెళ్లే పిల్లలను, పెద్దలను కరుస్తూ తీవ్రంగా గాయపరుస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. అలాగే సిద్దవటం రోడ్డులోని మాంసపు దుకాణాల వద్ద కుక్కలు ప్రధాన రహదారిపై స్వైర విహారం చేస్తూ ద్విచక్ర వాహనదారుల వెంట పడుతుండడంతో చాలామంది కిందపడి గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. రాత్రి సమయాలలో కొన్ని వీధులలోకి వెళ్లాలంటే ప్రజలు ఆటోలలోను, ద్విచక్ర వాహనాలలోను వెళ్తున్నారే తప్ప కాలినడకన వెళ్లేందుకు ధైర్యం చేయడం లేదు. మరోవైపు వీధికుక్కలు, పశువులు, మేకలు, గొర్రెలపైన కూడా దాడులు చేస్తున్నాయి.

కుక్కలతో బెంబేలెత్తుతున్నాం



పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో వీధులలో తిరగాలంటే బెంబేలెత్తిపోతున్నాం. చిన్న పిల్లలపై కూడా దాడిచేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. రాత్రివేళల్లో తిరగాలంటే ప్రాణాలు అరచేత పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. వీధులలో కుక్కలు లేకుండా నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- పి.ప్రసాద్, మార్తోమానగర్, బద్వేలు

అధికారులు పట్టించుకోవడం లేదు



పట్టణంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఏ వీధిలో చూసినా కుక్కల బారిన పడి గాయాలపాలైన వారు కనిపిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులపై నిత్యం దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

\- చెన్నకేశవులు, గుంతపల్లె

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు అధికంగా ఉన్నాయని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. కుక్కలను నియంత్రించేందుకు ఇటీవల మున్సిపల్‌శాఖ మంత్రితో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆదేశాలు రాగానే కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయించి చర్యలు తీసుకుంటాం.

\- ఎం.క్రిష్ణ, మున్సిపల్ కమిషనర్, బద్వేలు

ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శిగా సిద్దేశ్వర రెడ్డి

కలసపాడు : గ్రామ సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సిద్దేశ్వరరెడ్డిని నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సిద్దేశ్వరరెడ్డి తెలిపారు.

రెగ్యులర్ ఏఓను నియమించాలి

గోపవరం : రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించాలని ఏడీఏ నాగరాజుకు రైతులు విజ్ఞప్తి చేశారు. గతంలో ఏఓగా పనిచేస్తూ ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లిన అరవిందనాయక్ స్థానంలో అట్లూరు ఏఓ రామకృష్ణయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రెగ్యులర్ ఏఓ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏడీఏ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. పంట నమోదు కార్యక్రమం కూడా ప్రారంభమైనందున ఏఓ లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మండలానికి రెగ్యులర్ ఏఓను నియమించాలని రైతులు కోరుతున్నారు.

మాతా, శిశుమరణాలు లేని సమాజమే లక్ష్యం

ప్రొద్దుటూరు క్రైం : మాతా, శిశుమరణాలు లేని సమాజం కోసం అందరూ పని చేయాలని డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. డీపీఎంఓ మాట్లాడుతూ తల్లి పాల ఆవశ్యకత గురించి వివరించాలని సూచించారు. మానసికంగా బాధపడే వారిని గుర్తించి సంబంధిత వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలని పేర్కొన్నారు. డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, బీపీ వరప్రసాద్, చంద్రకళ పాల్గొన్నారు.

తేటతెల్లమైన చంద్రబాబు నైజం

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం తేటతెల్లమయిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విమర్శించారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని పరోక్షంగా తేల్చి చెప్పారని పేర్కొన్నారు. సంపద సృష్టించి, ఆదాయం పెంచి హామీలు నెరవేరుస్తానని ఎన్నికల ప్రచారంలో గొప్పగా చెప్పారని, దానిపై కలెక్టర్ల సమావేశంలో ఒక్కమాట కూడా చెప్పలేదని విమర్శించారు. పదే పదే ఖజానా ఖాళీ అంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తెలిపారు.

పరామర్శ

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు గ్రామానికి చెందిన మాజీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా కృష్ణారెడ్డి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి మంగళవారం ఉదయం కొండా కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయన వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కాల్చివేయడం దుర్మార్గం

బద్వేలు అర్బన్ : పేదల గుడిసెలను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ తప్పుబట్టారు. మంగళవారం కాలిబూడిదైన గుడిసెలను ఆయన బద్వేలు రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాకరాపేట సమీపంలోని సర్వేనెంబరు 1,580లో గల ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు అర్ధరాత్రి సమయంలో వచ్చి గుడిసెలను తొలగించి నిప్పు పెట్టడం సరైంది కాదన్నారు. మండలంలోని పలు సర్వే నంబర్లలో వందలాది ఎకరాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదలు వేసిన గుడిసెలపైకి ఆగమేఘాల



కాల్చివేసిన పేదల గుడిసెలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మీద చర్యలకు ఉపక్రమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, ఏరియా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, విజయమ్మ, నాయకులు సుధాకర్, లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

గోపవరం : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ ధనలక్ష్మి సూచించారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సమావేశాలు నిర్వహించుకుంటున్నామని, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే విధంగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ మాట్లాడుతూ ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో ప్రజాప్రతినిధులు తెలియజేయాలని కోరారు. గోపవరం పంచాయతీలో చేపట్టిన తాగునీటి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాలేదని స్థానిక ఎంపీటీసీ సరస్వతి ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. బిల్లులు పెట్టడం జరిగిందని, ప్రభుత్వం మంజూరు చేయాలని తెలిపారు. గతంలో గండి పడిన టీ.సం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

ద్రపల్లె చెరువుకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ రాధాకృష్ణన్, తహసీల్దారు ఉదయభారతి, జెడ్పీటీసీ జయరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, భాగ్యమ్మ, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటు పద్ధతి మారింది..!

వరిసాగులో ఇప్పుడు బురద పొలాలు, నారు మడులు, నాట్లు లేవు. నేరుగా విత్తనాలు విత్తుతున్నారు. ఈ విధానం పాత పద్ధతే అయినా.. వరి సాగులో సత్ఫలితాలిస్తోంది. అదును సమయంలో కూలీలు దొరక్క ఇబ్బంది పడే సందర్భాల్లో ప్రత్యామ్నాయం వైపు రైతులు దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా కూలీల ఖర్చు మిగలమే కాకుండా పంట కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తోంది. పొలంలో ముందుగా సేద్యాలు చేశాక వడ్లను పెట్టెగొర్రులో పోసి తేమశాతం లేని పొలంలో ట్రాక్టరుతో విత్తనం వేస్తున్నారు. ఆ తర్వాత నీటి తడులు అందిస్తున్నారు. ఈ విధంగా వరి పంటను సాగు చేయడంతో ఎకరాకు రూ.10 నుంచి 15 వేలు ఆదా అవుతున్నట్లు కర్షకులు చెబుతున్నారు.

\- రాజుపాళెం



కేసీ చాపాడు కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు



ట్రాక్టరుతో వరి విత్తనాన్ని వేస్తున్న రైతులు



పెట్టెలో వరి విత్తనాలను పోస్తున్న రైతు

ముర్రుపాలు అమృతతుల్యం

రాజుపాళెం : అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృతతుల్యమని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని వెంగళాయపల్లె గ్రామంలో మంగళవారం తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ పుట్టిన వెంటనే తల్లి పాలను తాపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని గర్భిణులు, బాలితలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పుష్పలత, కార్యకర్త కలావతి, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం

చాపాడు : అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రమ్మ అన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

ప్రొద్దుటూరు క్రైం : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్‌కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లి పాలు తాగడం వలన బిడ్డలకు అంటువ్యాధులు సోకవని తెలిపారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్డ్స్ ప్రెసిడెంట్ ఎంపీ సుబ్బారెడ్డి, డీపీఎంఓ శివశంకరయ్య, సూపర్‌వైజర్ రాజారత్నం, సిద్ధారెడ్డి, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రాజుపాళెం: వెంగళాయపల్లెలో మాట్లాడుతున్న సీడీపీఓ అరుణకుమారి



చాపాడులో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సావిత్రమ్మ

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

అట్లూరు : పెద్దకామసముద్రం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై విద్యుత్ స్తంభాలు పడి కాళ్లు చేతులు విరగడానికి కారకుడైన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు చిన్ని, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. ఆంజనేయులు, మండల నాయకుడు శ్రీకాంత్ కోరారు. గత నెల 31 వ తేదీన పెద్దకామసముద్రం ప్రభుత్వ పాఠశాల ప్రధాన గేటు వద్ద కాంట్రాక్టర్ బుజ్జిబాబు 21 విద్యుత్తు స్తంభాలు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఒక విద్యార్థికి కాళ్లు చేతులు విరిగాయని, మరో ఆరుగురు గాయపడ్డారని తెలిపారు. విద్యార్థులకు కాంట్రాక్టర్ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

త్వరలో టౌన్ బ్యాంక్ నూతన చైర్మన్ ఎన్నిక

ప్రొద్దుటూరు : ది ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన చైర్మన్‌ను త్వరలో ఎన్నుకోనున్నారు. గత రెండేళ్ల నుంచి చైర్మన్‌గా కొనసాగుతున్న యెల్లాల కుమార్‌రెడ్డి ఈనెల 2వ తేదీన రాజీనామా చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. అదే రోజు నుంచి వైస్ చైర్మన్‌గా ఉన్న మహమ్మద్ అక్రమ్ గౌస్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

మిత్ర పురుగులతో పంటకు మేలు

అట్లూరు : వరి సస్యరక్షణలో మిత్ర పురుగుల పాత్ర ఎంతో కీలకమని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలకూరు, మణ్యంవారిపల్లి, కాటంవారిపల్లి గ్రామాలలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మిత్ర పురుగుల మేలు, శత్రు పురుగుల నష్టంపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరినారు నాటే సమయంలో కొనలు తుంచి నాటాలని సూచించారు. జిగురుతో కూడిన నీలం, తెలుపు, పసుపు రంగు అట్టలు వాడటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలకూరు రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకురాలు అనూష, పకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యాజమాన్య పద్ధతులపై వివరిస్తున్న ఏడీఏ నాగరాజు

నీలం జిగురు అట్టలతో చీడపీడల నివారణ

మైదుకూరు : మిరప పంటలో నీలం జిగురు అట్టలను ఏర్పాటు చేయడం వలన చీడపీడలను అరికట్టవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో మిరప పంటలో సమగ్ర చీడపీడల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండంలోని గంగాయపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య పొలంలో నీలం జిగురు అట్టల వినియోగం.. దాని ఉపయోగాలపై అవగాహన కల్పించారు. వేపనూనె పిచికారీ గురించి సవివరంగా తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యం గురించి విపులంగా చెప్పారు. విత్తనాలు శుద్ధి చేసుకొని సొంత నారుమడి పెంచుకోవడం ద్వారా మిరపపై వచ్చే చీడపీడల సమస్యను అరికట్టవచ్చని పేర్కొన్నారు. నీలి రంగు జిగురు అట్టలను రైతులకు అందజేశారు.



నీలం జిగురు అట్టలను రైతులకు అందజేస్తున్న శాస్త్రవేత్తలు బాలకృష్ణ, ఫిరోజ్ హుస్సేన్

టేకూరుపేట పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పోరుమామిళ్ల : టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్, ఫార్మసీ, కాన్పుల వార్డును పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. తల్లిపాల వారోత్సవాలు జయప్రదం చేయాలని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు ఇవ్వాలని, ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. సమావేశంలో జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్‌రెడ్డి, డాక్టర్ కరిష్మా, ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు

జెడ్పీ పాఠశాల తనిఖీ

మండలంలోని కవలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం జెడ్పీటీసీ బృందం కవలకుంట్ల ప్రాథమిక పాఠశాలను, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ స్వీపర్, వంటమనుషులను మార్చడంపై ముత్యాల ప్రసాద్ ఆరా తీశారు. ఎందుకు మార్చారని ఎంఈఓకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇష్టారాజ్యంగా తొలగించడం, మార్చడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.